www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 13 జనవరి 2024
5
తూర్పుగోదావరి




కవి, రచయిత ప్రమోద్‌కు సత్కారం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని పైడిమెట్లకు చెందిన కవి, రచయిత సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో తెలుగు భాష సంస్కృతి కోసం కషి చేస్తున్న సంస్థలకు, కవులకు సాహితీ వేత్తలకు సంక్రాంతి పండుగ సందర్భంగా అందించే పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ఏలూరు నగర కార్పొరేటర్ శ్రీదేవి చేతుల మీదుగా ఏలూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

తూర్పులో రాజకీయ వేడి

- అభ్యర్థుల ఖరారులో వైసిపి
- జాబితాపై స్పష్టత లేని టిడిపి, జనసేన పార్టీలు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజకీయం వేడెక్కుతుంది. గెలుపే లక్ష్యంగా ఆయా పార్టీలు సాగుతున్నాయి. అధికారం చేపట్టేందుకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాయి. దీనిలో భాగంగా అధికార వైసిపి ఆయా నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాపై కసరత్తులు దాదాపుగా పూర్తి చేసింది. కొన్ని స్థానాల అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించగా మరికొన్నింటిని పెండింగ్‌లో ఉంచింది. ఈ నెల 20 తేదీలోపే వాటిని కూడా ప్రకటించే అవకాశం ఉంది. ఇదే సందర్భంలో జనసేన, టిడిపి పొత్తులో ఉండగా సీట్ల సర్దుబాటు అంశంపై ఇంకా ఇరు పార్టీల మధ్య క్లారిటీ కనిపించడం లేదు. వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఏప్రిల్‌లో అనుకున్న సమయానికి సార్వత్రిక ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ప్రకటనపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఆ పార్టీల ఆశావహుల్లో టెన్షన్ వాతావరణ నెలకొంది. అధికార వైసిపి అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తోంది. గెలుపు గుర్రాలపై ఫోకస్ పెట్టింది. దానిలో భాగంగానే కాకినాడ జిల్లాలో పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట సిట్టింగ్ ఎంఎల్‌ఎలు పెండెం దొరబాబు, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, జ్యోతుల చంటిబాబు స్థానాల్లో కాకినాడ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, మాజీ మంత్రి తోట నరసింహంకు టికెట్లను ఇటీవల కన్ఫర్మ్ చేసింది. కాకినాడ సిటీ నుంచి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి సిట్టింగ్ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు, తుని నుంచి మంత్రి దాడిశెట్టి రాజా, పెద్దాపురం నుంచి దవులూరి దొరబాబు పోటీలో వుండనున్నారు. వీరి అభ్యర్థిత్వం కూడా దాదాపుగా ఖరారు అయినట్లే. తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో నుంచి ఎంపీ మార్గాని భరత్ రామ్, రూరల్ నుంచి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణలను ఖరారు చేస్తూ ఇటీవల అధిష్టానం ప్రకటించింది. రాజానగరం నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా, అనపర్తి నుంచి సత్తి సూర్యనారాయణ రెడ్డి, నిడదవోలు నుంచి శ్రీనివాస నాయుడు, కొవ్వూరు నుంచి తానేటి వనిత పోటీలో ఉండనున్నారు. దీనిపై అధిష్టానం ప్రకటనే తరువాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అధికార పార్టీ నుంచి ఇప్పటికే పి.గన్నవరం నియోజకవర్గ నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబు స్థానంలో జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రామచంద్రపురంలో మంత్రి వేణు స్థానంలో పిల్లి సుభాష్ చంద్రబోస్ కుమారుడు పిల్లి సూర్యప్రకాష్‌కు అధికారికంగా టిక్కెట్లను ఖరారు చేసింది. అమలాపురం నుంచి మంత్రి పినిపే విశ్వరూప్ లేదా ఆయన కుమారుడు శ్రీకాంత్‌కు టికెట్ కేటాయించే అవకాశం ఉంది. ముమ్మిడివరం నుంచి పొన్నాడ సతీష్ కుమార్‌కు, రాజోలు రాపాక వరప్రసాద్‌కు, కొత్తపేట చిర్ల జగ్గరెడ్డికి, మండపేట తోట త్రిమూర్తులుకు దాదాపుగా టికెట్లు ఖరారు అయ్యాయి.

టిడిపి, జనసేనలో రాని స్పష్టత

టిడిపి జనసేన పొత్తులో ఉండగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మెజార్టీ సీట్లను గెలుచుకోవాలని ఆ పార్టీలు భావిస్తున్నాయి. సీట్ల సర్దుబాటు అంశంపై రెండు పార్టీలు ఇంకా క్లారిటీకి రాలేదు. జనసేన కాకినాడ రూరల్, పిఠాపురం, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, రాజమండ్రి రూరల్, రాజానగరం, కొత్తపేట అసెంబ్లీ స్థానాలను అడుగుతున్నట్లు సమాచారం. దీనిపై ఇరు పార్టీల మధ్య ఇంకా సఖ్యత కుదరలేదు. ఒకవేళ ఆ పార్టీ ఆశించినట్లుగా ఇక్కడ టికెట్లు కేటాయిస్తే కాకినాడ రూరల్ నుంచి పంతం నానాజీ, పిఠాపురం నుంచి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, ముమ్మిడివరం నుంచి పితాని బాలకృష్ణ, రాజోలు నుంచి బొంతు రాజేశ్వరరావు, రాజమండ్రి రూరల్ నుంచి కందుల దుర్గేష్, రాజానగరం నుంచి బత్తుల బలరామ్, కొత్తపేట నుంచి బండారు శ్రీనివాస్ పోటీలో ఉండే అవకాశం ఉంది. జనసేనకు మూడు జిల్లాల్లోనూ కాకినాడ రూరల్, పిఠాపురం, రాజోలు, ముమ్మిడివరం, రాజమండ్రి రూరల్, రాజానగరం వంటి 6 స్థానాలను మాత్రమే కేటాయించే అవకాశం కనిపిస్తుంది. ఒకవేళ సీట్ల సర్దుబాటు గనుక పూర్తయితే కాకినాడ జిల్లాలో టిడిపి తరపున తుని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి యనమల రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్య, కాకినాడ సిటీ నుంచి మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు, పెద్దాపురం నుంచి నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాడు నుంచి వరుపుల రాజా సతీమణి సత్యప్రభ, జగ్గంపేట నుంచి జ్యోతుల నెహ్రూ బరిలో నిలవనున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రి సిటీ నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి భవాని, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు నుంచి మాజీ మంత్రి జవహర్, నిడదవోలు నుంచి బూరుగుపల్లి శేషారావు, గోపాలపురం నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావులు పోటీలో ఉండే అవకాశం కనిపిస్తోంది. అటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం అసెంబ్లీ బరిలో ఆనందరావు, ముమ్మిడివరం నియోజవర్గం నుంచి దాట్ల బుచ్చిబాబు, పి.గన్నవరం బరిలో హరీష్, రామచంద్రాపురం నుంచి సత్య స్కాన్ అధినేత కాదా వెంకటరమణ, మండపేట నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావులు బరిలో నిలుచునే అవకాశం ఉంది. అయితే టిడిపి అధిష్టానం వీరిని ఇంకా ఖరారు చేయలేదు. ఇదిలా ఉండగా రెండు పార్టీల్లోనూ సీట్ల సర్దుబాటు అంశం పెద్ద తలనొప్పిగా మారే అవకాశం కూడా ఉంది.



భవనం మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

స్ట్రాంగ్ రూమ్ కోసం న్యాక్ భవనం పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం నియోజక వర్గంలో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి పంపిణీ, ఇవిఎంలు, అనుబంధ యూనిట్స్‌ను భద్రపరిచేందుకు ముందస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం జెసి ఎన్.తేజ్ భరత్, రూరల్ తహశీల్దార్ పి.చిన్నారావుతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో ఉన్న న్యాక్ అనుబంధ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి నియోజక వర్గ పరిధిలో పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎన్నికల సామగ్రితో పాటు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్‌లను భద్రపరచి పోలింగ్ తేదీకి ముందు రోజు ఆయా సామగ్రిని ఎన్నికల సిబ్బందికి అందించాల్సి ఉంటుందన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసిన తరువాత, జిల్లాకు చెందిన అన్ని నియోజక వర్గాల బ్యాలెట్ బాక్సులు, ఇతర ఓటింగ్ సామగ్రిని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తామన్నారు. ప్రతి నియోజక వర్గంలో ఒక తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌తో పాటూ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేసే క్రమంలో అనువైన భవనాలను గుర్తించి, ఎన్నికల కమిషన్‌కు నివేదిక అందిస్తామన్నారు. తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో తాత్కాలిక స్ట్రాంగ్ గుర్తించే ప్రక్రియను సంబంధిత నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు గుర్తించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

జాన్ కెనడీ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - కడియం



టోర్నీని ప్రారంభిస్తున్న కెనడీ కుటుంబ సభ్యులు

మండంలోని మురముండలో పిచ్చుక కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పైడిమళ్ల జాన్ కెనడీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కెనడీ కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రారంబించారు. కుమార్తె శిరీష, అల్లుడు ఉమా సాయి, డిసిఎంఎస్ డైరెక్టర్ అయినవల్లి వెంకటేశ్వర్లు, మెల్లిమి గంగరాజు తదితరులతో కలిసి టోర్నీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిఎంఎస్ డైరెక్టర్ అయినవిల్లి వెంకటేశ్వర్లు విచ్చేసి మాట్లాడారు. కెనడీ జ్ఞాపకార్థం భార్య పైడిమళ్ళ శాంతకుమారి, కుమారుడు జగదీష్ ఈ టోర్నీని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ టోర్నీలో 18 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పాక రమణ, బిళ్లకుర్తి గంగాజలం, పైడిమళ్ళ సురేష్, ముమ్మిడివరపు సుధాకర్, అడ్డాల ప్రభుదాస్, బూరా సత్యనారాయణ, కొల్లి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

రానున్న ఎన్నికల్లో సహకరించాలి

ప్రజాశక్తి-గోకవరం

గతంలో నియోజకవర్గ ప్రజలు తనకు ఎంతో అండగా ఉన్నారని, ఈ సారి ఎన్నికల్లోనూ తనకు సహకరించి గెలిపించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం కోరారు. గోకవరంలో వైసిపి ఆత్మీయ సమావేశం మాజీ సొసైటీ అధ్యక్షులు దాసరి చినబాబు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తోట నరసింహం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనకు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగ స్వాగతం పలికారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ వైఎస్ఆర్ విగ్రహానికి తోట పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా కృష్ణునిపాలెంలో గల గోపికృష్ణ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎంఎల్‌ఎగా పనిచేసిన సమయంలో తన వెంట ఉండి తన గెలుపునకు కృషి చేసిన నాయకులకు, కార్యర్తలకు ఎంతో రుణపడి ఉంటానన్నారు. అదే సహకారం 2024 ఎన్నికల్లోనూ చూపించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, నాయకులు సుంకర వీరబాబు, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఒమ్మి రఘురామ్, గుల్లా ఏడుకొండలు, వరసాల ప్రసాద్, మడికి మైనర్ బాబు, సుంకర రమణ, ఎంపిటిసిలు, సర్పంచులు, జగ్గంపేట గండేపల్లి, కిర్లంపూడి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం ఎస్ఐ అప్పలరాజు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం ఎస్ఐగా వి.అప్పలరాజు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో రాజమహేంద్రవరం 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించారు. బదిలీపై ఉండ్రాజవరం వచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడనని తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ రామారావు బదిలీపై అనపర్తి వెళ్లారు.

అంగన్‌వాడీలకు మద్దతుగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీలకు మద్దతుగా శుక్రవారం సంతకాల సేకరణను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సమ్మె శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈ సమ్మె 32వ రోజుకు చేరింది. **రాజమహేంద్రవరంలో** సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 24 గంటల నిరవధిక దీక్ష కొనసాగింది. గోపాలపురం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు ఈ దీక్షల్లో కూర్చొన్నారు. ఈ దీక్షలను యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం.విజయగౌరి, జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబిరాణి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. హామీలను అమలు చేయాలన్నారు. సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలపై బెదిరింపులు ఆపాలని, ఎస్మాను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా గోకవరం బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున సంతకాలు చేసి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, యుటిఎఫ్ నాయకులు జె.రూపస్‌రావు, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, సిఐటియు జిల్లా కోశాధికారి కెఎస్‌వి.రామచంద్రరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జె.సునీత, కె.శారద, బి.రామలక్ష్మి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** తహశీల్దార్ కార్యాలయం సమీపంలో అంగన్‌వాడీల సమ్మె శిబిరం కొనసాగుతోంది. యూనియన్ నాయకులు పి.విజయకుమారి, కె.లక్ష్మి మాట్లాడారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలనే అడుగుతున్నాం తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. జీతాలు పెంచాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని, పింఛను ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఉన్న తమకు నోటీసులిస్తూ బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించాలని కోరారు. **ఉండ్రాజవరంలో** అంగన్‌వాడీలు ప్రత్యేక ప్రార్థనలు చేసి నిరసన తెలిపారు. పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో సామూహిక ఉరి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీలు తమ మెడలకు ఉరితాడు తగిలించుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.రంగనాయకమ్మ, వి.లక్ష్మి, కెఎంఎస్.ప్రసన్నకుమారి, రత్నకుమారి, సిహెచ్.జ్యోతి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. అంగన్‌శాడీలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు ఉషా దేవి మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి ప్రీస్కూల్‌ను బలోపేతం చేయాలన్నారు. అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. నాణ్యమైన సరులకు సరఫరా చేయాలన్నారు. అంగన్‌వాడీలు సమ్మెలో ఉండగా తాళాలు పగులగొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వాలంటీర్లను పెట్టి సెంటర్లను నడపడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎం.మాలతి, జి.విజయకుమారి, ఎం.భాస్కర్, పి.ధర్మకుమారి తదితరులు పాల్గొన్నారు.



మద్దతుగా సంతకం చేస్తున్న యువతి




గోకవరం అంగన్‌వాడీలకు భోజనం పెడుతున్న ఉపాధ్యాయులు



ఉండ్రాజవరంలో ప్రత్యేక ప్రార్థనలు

కార్టూ'నిజం'



ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పలు స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీలు, విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరుగుతున్నాయి. **గోపాలపురం** శివ సాయి వర్తక సంఘ ఆధ్వర్యంలో సంతూర్ కంపెనీ వారి సహకారంతో శుక్రవారం దొండపూడులో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వమించారు. వర్తక సంఘ సభ్యులు మాట్లాడుతూ సంతూర్ కంపెనీ ఎఎస్ఎం కొల్లి వెంకటేశ్వరరావు, డి.భవాని శ్రీనివాస్, జెఎస్ఒ సంతూర్ స్టాటిస్ట్ వెలగా సాంబశివరావు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శివ సాయి వర్తక సంఘ ప్రెసిడెంట్ వెన్న వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ మద్దు వీరభద్రం, సెక్రటరీ సత్యవరపు సాయి ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు. **చాగల్లు** నేలటూరు లయన్స్ క్లబ్ సంతూర్ సోప్స్ ఆధ్వర్యంలో చాగల్లులోని పాటమ్మ పేట రామాలయం వద్ద శుక్రవారం రంగవల్లి పోటీలను నిర్వహించారు. 62 మంది పాల్గొన్నారని లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోడి సూర్యప్రకాశరావు, కె.వెంకటేశ్వరరావు తెలిపారు. విజేతలకు, పాల్గొన్నవారందరికీ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాన్న లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు ప్రారంభించారు.



రాజమహేంద్రవరంలోని విజన్ అకాడెమీలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు, యాజమాన్యం

'విజన్'లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరం : దానవాయిపేట విజన్ అకాడెమీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నామని అకాడెమీ ఫౌండర్, డైరెక్టర్ యాగా గోవిందరాజు తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగి మంటలు, ఆట, పాటలతో ఆనందంగా జరిగింది. అనంతరం డైరెక్టర్ గోవిందరాజు విద్యార్థులు, సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు గోవిందరాజు చేతులు మీదుగా బహుమతులు అందించారు.

ఎఒ పనితీరుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-గోకవరం

ఎఒ తీరు సరిగా లేని పలువురు ఎంపిటిసి సభ్యులు మండల సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.పద్మజ్యోతి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపిపి సుంకర శ్రీవల్లి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ఎంపిటిసి సభ్యులు మాట్లాడారు. ఎఒ రైతుల్ని ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. రైతులు అడిగిన సందేహాలకు, ప్రశ్నలకు సమాధానం సక్రమంగా చెప్పడం లేదని తెలిపారు. ఎఒ పనితీరు సక్రమంగా లేదని ఉన్నత అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశానికి హాజరైన వ్యవసాయ శాఖ ఏడి మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారన్నారు. మండలంలో 1.35 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు చేసిన సొమ్ము చెల్లించామన్నారు. జనవరి నెలాఖరిలోగా రబీకి సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ అనిత మాట్లాడుతూ వైఎస్ఆర్ పశుబీమా నమోదుకు చర్యలు చేపట్టామన్నారు. విద్యాశాఖాధికారి మాట్లాడుతూ రానున్న కాలంలో మండలంలో ఒకేషనల్ కళాశాల ఏర్పాటు కానుందన్నారు. అలాగేఊ పలువురు సభ్యులు కోతులు, కుక్కల వల్ల సమస్యలను ప్రస్తావించారు. చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మండల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు, వైఎస్ ఎంపిపి మడికి మైనర్‌బాబు, జి.చిట్టిబాబు, పలువురు అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-రామచంద్రపురం

యానాం ఏటిగట్టు మీదుగా మద్యం బాటిల్స్‌ను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కోట గ్రామం వద్ద అరెస్టు చేసినట్లు కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా తెలిపారు. వారి వద్ద నుంచి తొమ్మిది యానాం మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రామచంద్రపురం సిఐ పి.దొర రాజు మాట్లాడుతూ సంక్రాంతి పండగల్లో ఎవరైనా కోడిపందేలు, పేకాటలు, గుండాట, అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

118 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని మీనా నగరం గ్రామానికి చెందిన ఆతుకూరి సుబ్బారావు నుంచి 118 కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు నిర్వహించకుండా తనిఖీలు చేపట్టామని ఎస్ఐ సిహెచ్.వి.రమేష్ తెలిపారు. ఈ తనిఖీల్లో కోడికత్తులను కలిగి ఉన్న సుబ్బారావును అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని కాండ్రేగుల గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగార్జున రాజు తెలిపిన వివరాల ఉన్నాయి. మండలంలోని కాండ్రేగుల గ్రామానికి చెందిన మేకల కార్తీక్ (30) అతని ఇద్దరు స్నేహితులతో కలిసి కుందేళ్లను వేటాడేందుకు గురువారం అర్ధరాత్రి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ అడవి పందులను పట్టుకునేందుకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మేకల కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో కార్తీక్‌తో వచ్చిన ఇద్దరు స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కార్తీక్ మృతదేహాన్ని చెరువులో పడేసి ఉబకీలలో పోయే విధంగా పూడ్చి వేశారు. ఈ కేసు లో నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలు, సారా స్వాధీనం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్ఇబి అధికారులు శుక్రవారం ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల్లో దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్ళు, సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఇబి సిఐ పి.అశోక్ మాట్లాడుతూ ఏలేశ్వరంలో 20 లీటర్ల సారాతో ఒక మహిళను, పెద్దనాపల్లి, నెల్లిపూడి గ్రామంలో 20 బాటిళ్లు 180 ఎంఎల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ బి.శ్రీనివాసరావు, సిబ్బంది కృష్ణారావు, వెంకన్న దొర, దొరబాబు, రాంబాబు రాజు, రామకృష్ణ ఉన్నారు.

ఐదు గ్యాస్ బండలు పట్టివేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

హోటల్లో అక్రమంగా వినియోగిస్తున్న ఐదు గ్యాస్ సిలిండర్లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఇన్‌ఛార్జి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్ బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు హోటల్లలో తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్ర వరం శ్రీరామ్‌నగర్‌లోని హోటల్ దేవీ టిఫిన్స్ సెంటర్‌లో తనిఖీ చేసి ఇంటి అవసరాలకు వినియోగించే ఐదు గ్యాస్ సిలిండర్లను గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్ మెంట్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, కానిస్టేబుల్ లోవరాజు, కిషోర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించి, గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలంటూ ఎంఎల్ఎ తలారి వెంకట్రావుకు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు విజ్ఞప్తి చేసుకున్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు మాట్లాడారు. గతంలో తమ సొంత నిధులతో చేసిన పనులకు నేటికీ బిల్లులు రాలేదన్నారు. అలాగే నాడు-నేడులో భాగంగా చేసిన పనులకు ఎటువంటి బిల్లు రాలేదన్నారు. వాటిని వెంటనే చెల్లించేలా చూడాలని ఎంఎల్ఎను వేడుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు వేయాల్సి ఉందని, కొన్ని చోట్ల హై టెన్షన్ వైర్లు తొలగించాలని పలుమార్లు విన్నవించిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. వీటిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని, త్వరలోనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జూదాలు నిర్వహించరాదు

సంక్రాంతి పండుగ పేర కోడిపందేలు, ఇతర జూదాలు నిర్వహించరాదని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండాట, పేకాటలు, కోడిపందేలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్ఎస్.శ్రీనివాస్, తహశీల్దార్ బి.రవీంద్రనాథ్, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఇళ్ల భాస్కరరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న కార్పొరేట్ వైద్య సేవలను ఉపయోగించుకోవాలని వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అన్నారు. రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయం 2 పరిధిలో ఈ శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణ, గ్రామ కార్యదర్శి డి.శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సంధ్య, వైద్యులు నిశాంత్ హారిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పరశురామారావు

ఓటు వినియోగించుకునేలా చూడాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లో ఎఎల్ఎంటి(అసెంబ్లీ నియోజక వర్గ మాస్టర్ ట్రైనర్)రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో జెసి తేజ్ భరత్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ జి.నరసింహులు, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, నోడల్ అధికారులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఉదయం పోస్టల్ బ్యాలెట్, మధ్యాహ్నం ఐటి- సి విజిల్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే వ్యక్తులు, ఎలెక్టర్లు పోస్టల్ బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడానికి అర్హులన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగ ప్రక్రియలో క్యాబ్(సిఎబి) 13ఎ / బి / సి / డి ఫారాలపై అవగాహన కల్పించాలన్నారు. డిక్లరేషన్, పోస్టల్ బ్యాలెట్ పెట్టే కవర్లు, ఓటు వేసే ప్రక్రియలో మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. మార్గదర్శకాలు పాటించని ఓటును పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ఈ శిక్షణలో భాగంగా సేవా ఓటర్లు- (భర్తతో సహా) ప్రాక్సీ ఓటింగ్‌ని ఎంచుకున్న వారు తప్ప, యూనియన్ సాయుధ దళాల సభ్యులు, ఆర్మీ చట్టం, 1950 వర్తించే ఇతర దళాల సభ్యులు, రాష్ట్రం వెలుపల పనిచేసే రాష్ట్ర సాయుధ పోలీసు దళ సభ్యులు, భారతదేశం వెలుపల పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, గైర్హాజరీ ఓటర్లతో సహా నోటిఫైడ్ ఓటర్లు - 80 ఏళ్లు పైబడిన ఓటర్లు, 40 శాతం పైబడి ఉన్న వికలాంగులుగా గుర్తించబడిన ఎలెక్టర్లు, కోవిడ్ సోకిన ఓటర్లు, అవసరమైన సేవల్లో లేదా ఏదైనా ఇతర కేటగిరీలో పనిచేస్తున్న ఓటర్లు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా నోటిఫై చేయబడిన ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఎ.చైత్రవర్షిణి, ఎబివిఎస్‌బి.శ్రీనివాస్, కృష్ణనాయక్, ఎం.ఝాన్సీరాణి, ఎస్.సరళావందనం, ఎం.వెంకటసుధాకర్ తదితరులు హాజరయ్యారు.



నిరసనలో కూర్చొన్న ఎంఎల్ఎ అశోక్, కృష్ణారావు

డంపింగ్ యార్డ్ పెట్టొద్దని నిరసన

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు వార్డులోని గోపాల్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద డంపింగ్ యార్డ్,రిసోర్స్ రికవరీ పార్క్ పెట్టొద్దని శ క్రవారం గ్రామస్తులు నల్ల చెరువు గోపాల్ నగర్ జంక్షన్ వద్ద నిరసనకు దిగారు. తమ గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించకుండా పుదుచ్చేరి ప్రభుత్వం, అధికారులు మొండిగా వ్యవహరిస్తోంన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌కు తాము పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. స్థానికంగా రిసోర్స్ రికవరీ పార్క్ నిర్మాణం చేపడితే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటామని తమ గ్రామానికి ఆనుకుని స్కూల్స్, నవోదయ విద్యాలయ, ఉన్నాయని మునుముందు రోజుల్లో అక్కడ నివాసం ఉంటున్న ప్రజలకు అనారోగ్య సమస్యలకు దారితీస్తాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిరసనలో పాల్గొని తమకు మద్దతు తెలియజేయాలని స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధులను కోరినట్లు తెలిపారు. తమ సమస్యను ఇద్దరు ప్రజా ప్రతినిధుల మధ్య ఉంచామని దానిని పరిష్కరించే బాధ్యత తీసుకోవాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం సూర్య ప్రకాష్ కోరారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ పుదుచ్చేరి ప్రభుత్వం తన అభిప్రాయాన్ని మార్చుకుని జననివాసాలు లేని చోటుకి తరలించాలని కోరారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తమపై లేనిపోని అబాండాలు వేయడం సరికాదన్నారు. తమ ఇద్దరికీ ఈ డంపింగ్ యార్డ్ పెట్టాలని ఉద్దేశం లేదని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తాము పూర్తి వ్యతిరేకమని తెలిపారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ కనకాలపేట, భీమ్ నగర్, యూకెవి నగర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్ వల్ల ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దానిని వేరే చోటికి తరలించాలని నిరాహార దీక్ష చేసిన సమయంలో మంత్రులను అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నామాడి అప్పారావు,పండు సిద్దార్ధ కుమార్,ఆకుల సతీష్, సంసాని, ఆరిశెట్టి రాజేష్, పంపన దుర్గారావు, కె.సుబ్బరాజు, మున్నా, గోపాల్ నగర్ మెట్టకూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేవతి సైన్స్ ఫౌండేషన్ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడ

బాలికల్లో వైజ్ఞానిక దక్పథాన్ని, విద్యను ప్రోత్సహించేందుకు రేవతి సైన్స్ ఫౌండేషన్ చూస్తున్న కృషిని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, డిఇఒ జి.నాగమణి అభినందించారు. శుక్రవారం తన కార్యాలయంలో రామచంద్రపురానికి చెందిన రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న జాతీయ స్థాయి సైన్స్ పోటీల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు గల బాలికలకు సైన్స్ పదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షులు కె.శ్రీకృష్ణసాయి మాట్లాడారు. ప్రధానంగా సైన్స్ వినోదం, భౌతిక శాస్త్ర వినోదం, గణిత వినోదం ప్రయోగాలు నిర్వహిస్తారన్నారు. ఏకపాత్రాభినయం, ప్రకృతి విజ్ఞాన శాస్త్రవేత్తలు అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు ఎలాంటి రుసుము లేదన్నారు. ఈ నెల 14లోగా https://bit.ly/revathiscienceawards2024 వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామానుజన్ గణిత అకాడమీ అధ్యక్షులు డాక్టర్ కెవిపి.సత్యనారాయణ, కాకినడ జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు చింత నారాయణమూర్తి, ఉండ్రాజువరపు శ్రీనివాసరావు, జాతీయ బాలల సైన్స్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి-కడియం

వివేకానందుడిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని చెల్లిపిల్ల వేంకటశాస్త్రి కళా సేవా సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ కమిటీ అధ్యక్షులు తమ్మిశెట్టి ప్రసాదు , చెల్లిపిల్ల కమిటీ నాయకులు కొప్పిశెట్టి చంటి, కైలాస భూమి కమిటీ అధ్యక్షులు దంగుడు బియ్యం సత్యనారాయణ, రైతు కమిటీ అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు మాట్లాడారు. యుటిఎఫ్ నాయకులు అన్నెం దొరబాబు, కొమ్మరపూడి రవి, నాటక కళాకారులు బొర్రా రామకృష్ణ, పుల్లయ్య, శీలం సుబ్బారావు, వివేకానంద సమితి సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత చాగల్లు సచివాలయం-2 జట్టు

చాగల్లు : ఆడదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ పోటీల్లో చాగల్లు సచివాలయం-2 జట్టు విజేతగా నిలిచింది. ఎస్‌విఆర్‌కె పాఠశాల ఆవరణలో శుక్రవారం క్రికెట్ ఫైనల్ పోటీలను ఎంపిడిఒ పాతూరి నిర్మల కుమారి ప్రారంభించారు. ఉన్నగట్ల, చాగల్లు సచివాలయం(2) జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో చాగల్లు జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్. ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది, జడ్‌పిహెచ్ పీడీలు సిహెచ్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో మార్చురీ ప్రారంభం

గోపాలపురం : గోపాలపురంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, డిసిహెచ్ఎస్ ఎం.సనత్‌కుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మార్చురీ లేకపోవడంతో శవ పంచనామకు మృతదేహాలను కొవ్వూరు తరలించాల్సి వస్తుందన్నారు. దీని వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలకు సంబంధించి గోపాలపురం సిహెచ్‌సిలో రూ.3లక్షలను సమకూర్చారన్నారు. ఐఒసి సౌజన్యంతో రూ.40 లక్షలతో పోస్టుమార్టం నిర్వహణ షెడ్డులు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. స్థలం డాక్యుమెంట్లను వారికి అందిస్తే వారు త్వరలో షెడ్డు ఏర్పాటు చేస్తారనిసూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అత్తిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, డైరెక్టర్ పెనుగొండ బాలాజీ, డాక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

కడియం : మండలంలో రబీకి సంబంధించి (ఈ-కాప్ నమోదును రైతులందరూ చేయించుకోవాలని వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈలి గోపాలం, ఎఒ ద్వారకాదేవి అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ సలహామండలి సమావేశం గోపాలం అధ్యతన జరిగింది. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడారు. రైతులం దరకూ తప్పకుండా ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. గోపాలం మాట్లాడుతూ కడియం ఆవలో ఉన్న కాలువను శుభ్రం చేయించి , పంటలకు నీరు పుష్కలంగా అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్‌బికెల్లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం కడియం వ్యవసాయ, ఉద్యాన, సలహా మండలి సభ్యులు చైర్మన్ గోపాలాన్ని శాలువా, పూలమాలతో సత్కరించారు. సత్కరించారు.

అంబేద్కర్ అందరివాడు

ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి సందీప్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కుల మతాలకు అతీతంగా అన్నివర్గాల వారి హక్కుల కోసం, అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేద్కర్ అందరివాడని జిల్లా ఎస్‌సి సంక్షేమ, సాధికారత అధికారి ఎం.సందీప్ అన్నారు. విజయవాడలో ఈనెల 19న అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభిస్తున్న సందర్భంగా సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలను జనవరి 9 నుంచి 18వరకూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేద్కర్ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసేవిధంగా మానహారం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో లాలాచెరువు మున్సిపాల్ హైస్కూల్ పదోతరగతి విద్యార్థి అంబేద్కర్ వేషధారణ అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జి.సాంబశివరావు, డిఆర్‌డిఎ పీడీ ఎస్‌వివిఎస్.మూర్తి, ఉప సంచాలకులు రామారావు, అమృత, దళిత నాయకులు దారా యేసురత్నం, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




ఆన్‌లైన్‌లో ఎంప్లాయ్‌మెంట్ సేవలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఇక ఆన్‌లైన్‌లో ఎంప్లాయ్‌మెంట్ సేవలు అందుతాయని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ మేరకు ముద్రించిన పోస్టర్‌ను ఆమె శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో సేవలు, ఎంప్లాయ్‌మెంట్ సేవలను వెబ్ సైట్ employment.ap.gov.in ద్వారా అందిస్తారన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా అందించే రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్, రీసోర్స్ సెంటర్స్, ఇంటర్నెట్ సెంటర్, మొబైల్ ద్వారా కూడా ఈ సేవలను సులభంగా పొందొచ్చన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత వారికి లాగిన్ వివరాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబర్ వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా పంపుతామన్నారు. జిల్లా ఉపాధి అధికారి దరఖాస్తు అభ్యర్థనను ఆమోదించిన అనంతరం ఎస్ఎంఎస్ ద్వారా ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ నెంబర్ తెలియజేస్తారన్నారు. అభ్యర్థి తన ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్‌ను లాగిన్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. పాత ఎంప్లాయ్‌మెంట్ కార్డు నెంబరుతో వివరాలను సరిచూసుకుని కొత్త కార్డును పొందొచ్చనిజిల్లా ఉపాధి అధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్ తెలిపారు. ఇతర వివరాలకు కార్యాలయం పనివేళలో ఉదయం 10.30 నుంచి 5 గంటలవరకు సంప్రదించొచ్చన్నారు. లేదా 709366813, 8328486787 నెంబర్లను సంప్రదించాలన్నారు.





ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వాదాలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003-08 బ్యాచ్ విద్యార్థుల కలయిక శుక్రవారం ఉత్సాహంగా సాగింది. స్నేహితులందరూ ఒక వేదికపై కలవడం ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో హేమలత ,సింధు,మోహినికళ్యాణి అవినాష్,దేవేంద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

రాజమహేంద్రవరం : స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. తొలుత స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడారు. వివేకానంద జయంతిని భారత ప్రభుత్వం జాతీయ యువజన దినోత్సవంగా జరుపుతుందన్నారు. వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ అధికారులు, రెడ్ క్రాస్ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నర్సరీ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- కడియం

నర్సరీ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, వైసిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నర్సరీ రైతులతో ఆయన శుక్రవారం రాత్రి సమావేశమయ్యారు. పలు సమస్యలను నర్సరీ రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉచిత విద్యుత్ మోటార్లకు మీటర్ల బిగింపును తాత్కాలికంగా నిలిపేసేందుకు హామీనిచ్చారు. నర్సరీలకు అవసరమగు మట్టి విషయంలో మైనింగ్ బిల్లులపై ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య తీరుస్తానన్నారు. అలాగే కడియం నర్సరీల ప్రాంతాన్ని ఎపి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో నర్సరీ రైతులు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



నర్సరీ రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

మైనేని వెంకటరత్నంకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ

ఐక్య ఉపాధ్యాయ పత్రిక తొలి ప్రధాన సంపాదకుడు మైనేని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో ఆయనకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. తొలుత మైనేని చిత్ర పటానికి జోగా అప్పారావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 'ఉద్యమానికి ఆయుధం సాహిత్య అధ్యయనం' అనే అంశంపై జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఐ.ప్రసాదరావు ప్రసంగించారు. సమాజంలో అనేక వివక్షలపై ముఖ్యంగా కుల, లింగ వివక్షతలపై జ్యోతీరావు పూలే, అంబేద్కర్, గురజాడ అప్పారావు వంటి వారు తమ రచనలను ద్వారా ప్రజలను జాగృతం చేసారని తెలిపారు. ఆర్థిక అసమానతలపై కారల్ మార్క్స్, శ్రీశ్రీ అనేక రచనలు చేశారని తెలిపారు. నేటి సమాజంలోని జాతి లింగ భాషా కుల వివక్షలపై అభ్యుదయ భావాలు కలిగిన అందరూ సాహిత్యం అధ్యయనం చేయాలని, చైతన్యవంతమైన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు వివి రమణ అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, చక్రవర్తి, వర్మ, పత్రికా బాధ్యుడు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవితల పోటీల విజేతలకు మెమొంటోలు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

యర్రవరంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని యర్రవరంలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు మైరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఎనిమిదేళ్ల నుంచి తమ సమితి సభ్యులు రక్తదానం చేస్తున్నారన్నారు. జిల్లాలోనే కాక వివిధ జిల్లాల్లో ప్రమాదంలో ఉన్న అనేక మందికి రక్తదానం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు డాక్టర్ శైలజ, విశ్రాంత వైద్యులు డాక్టర్ ఎవి.రమణ, సమితి సభ్యులు పాల్గొన్నారు.